క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్‌తో అందరికీ వైద్యం



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద అందరికీ వైద్యం అందజేస్తున్నట్లు బొమ్మసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి రష్మిత తెలిపారు. ఏఎల్‌పురంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణు లు, బాలింతలు, మంచానికే పరిమితమైన రోగు లు, బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సిబ్బంది కవిత, స్వర్ణ, రీటా, ప్రవీణ్ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో మళ్లీ అంతర్గత బదిలీలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో రెండు రోజుల క్రితం జరిగిన ఉద్యోగుల అంతర్గత బదిలీల్లో మార్పులు జరిగాయి. ఇప్పటికే పలువురిని ఇతర స్థానాలకు బదిలీ చేయగా.. వాటిని మళ్లీ మారుస్తూ శుక్రవారం కమిషనర్ అరుణ ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ అధికారిగా నియమితులైన ఉమామహేశ్వర్‌రెడ్డిని ఆ స్థానం నుంచి తీసేసి, సీ–2 క్లర్క్‌గా నియమించారు. మేనేజర్‌గా నియమించిన గోపాలకృష్ణవర్మను అదనంగా రెవెన్యూ అధికారి పోస్టు కట్టబెట్టారు. ఇంజినీరింగ్ విభాగానికి బదిలీ చేసిన అమర్‌నాథ్‌రెడ్డిని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన సురేష్‌కుమార్‌ను ఆ పోస్టింగ్ నుంచి తప్పించి ఇంజినీరింగ్ విభాగంలోనే ఉంచారు. ఇక రికార్డు అసిస్టెంటుగా ఉన్న బాలాజీని రెవెన్యూ విభాగంలో నీటి పన్నుల విభాగానికి, గాంగ్ మజ్దూర్‌గా ఉన్న గుణవతిని డిస్పాచ్ క్లర్క్‌గా నియమిస్తున్నట్లు కమిషనర్ తాజాగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఘనంగా పౌర్ణమి వేడుకలు



విశేషాలంకరణలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో శుక్రవారం పౌర్ణమి పూజలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 5 గంటలకు స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి కాకడ హారతి సమర్పించారు. దేవతామూర్తులకు అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం 6 గంటలకు వీరబ్రహ్మేంద్రస్వామి అష్టోత్తర శతనామావళి పారాయణం చేశారు. కలశ పూజ, చంద్రపూజ నిర్వహించారు. ఉత్సవమూర్తులైన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి మహారాజ అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

గుణాత్మక విద్య అవసరం




రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ రుషేంద్రబాబు

ఐరాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మక విద్యనందించడం అవసరమని ఎంఈఓ రుషేంద్రబాబు ఆదేశించారు. గూబలవారిపల్లె, చుక్కావారిపల్లె, అక్కంచెరువుపల్లె ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. టీచర్లు దేవి, సుధాకర్, కరుణ పాల్గొన్నారు.

25 నుంచి రామాలయంలో ధార్మిక కార్యక్రమాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని కోదండరామాలయంలో ఈ నెల 25వ తేదీ నుంచి టీటీడీ ఆధ్వర్యంలో పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు వేణుగోపాల్ తెలిపారు. 25 నుంచి 27వ తేదీ వరకు ఉపన్యాసం, భజన ఉంటుందన్నారు. 28న కుంకుమ, గోపూజలు చేపట్టనున్నట్లు వివరించారు.

దోమల వ్యాప్తి నివారణే లక్ష్యం



మాట్లాడుతున్న సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ

యాదమరి(పూతలపట్టు): దోమల వ్యాప్తి నివారణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కీనాటంపల్లెలో ప్రజలకు మలేరియా జ్వరంపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ మాట్లాడుతూ దోమలు వ్యాప్తిని అరికడితేనే మలేరియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించగలమని వెల్లడించారు. ప్రధానంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు నివాస గృహాల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ దిల్షాద్, సచివాలయ కార్యదర్శి దివ్య, ఆశ కార్యకర్త అంజలి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



చిత్తూరు: యోగాసనాలు వేస్తున్న విజయం పాఠశాల విద్యార్థినులు





బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, మొగిలిమిట్టూరులో..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మురకంబట్టులోని అపోలో మెడికల్ కాలేజీలో శుక్రవారం యోగా దినోత్సవం నిర్వహించారు. శిక్షకులు పలు ఆసనాలు చేసి విద్యార్థులు చూపించారు.ధ్యానం వల్ల కలిగే ఆరోగ్యకర లాభాలను వివరించారు. ఈకార్యక్రమంలో అపోలో నిర్వాహకుడు నరేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతోందని ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్ బాబు అన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ప్రభుత్వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఎంఈఓలు పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ, నిత్య జీవితంలో మనిషి అనేక మానసిక, శారీరక ఒత్తిళ్లకు గురి అవుతుంటారన్నారు. ఒత్తిడిని దూరం చేసే శక్తి యోగాకు ఉందని తెలిపారు. అనంతరం యోగా ఎలా చేయాలి, ఆహార నియమాలను ఎలా పాటించాలనే విషయాలను గురించి వివరించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగాదినోత్సవాన్నినిర్వహించారు. యోగా గురువులు ప్రతాప్‌చంద్రనాయుడు, హరి, వెంకటయ్య మాట్లాడుతూ, యోగా సాధనతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతోందని అన్నారు. అనంతరం ప్రిన్సిపల్ వందనాత్రిపాఠి ఆధ్వర్యంలో కళాశాల నుంచి జాతీయ రహదారి మీదుగా బస్‌స్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఐరాలలో..

ఐరాల: యోగాతో మానసిక, శారీరక ఒత్తిడులను జయించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చుని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు ఐరాల సచివాలయంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పాశ్చాత్య దేశాలు సైతం యోగాను అనుసరిస్తున్నాయంటే దాని ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శి శ్యామల పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మానసిక ఉల్లాసానికి యోగా ఎంతో అవసరమని భవిత స్కూల్ సహిత విద్య ఉపాధ్యాయుడు దేవేంద్ర తెలిపారు. తవణంపల్లె హైస్కూల్‌లోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు పలు ఆసనాలను ఉత్సాహంగా చేశారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయుడు ఢిల్లీ పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: యోగాసాధన ద్వారా శారీరక, మానసిక ప్రశాంతత ఉంటుందని ఎంపీడీఓ ప్రసన్నకుమారి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వకుండా ఉండడానికి రోజులో సమయం దొరికినప్పుడల్లా యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథరెడ్డి, పీడీలు కృసన, ఢిల్లీ రాణి పాల్గొన్నారు.



తవణంపల్లె భవిత కేంద్రంలో యోగాసనాలు వేస్తున్న పిల్లలు

యోగాతో ఒత్తిడి నుంచి దూరం

గుడిపాల: యోగా చేయడం ద్వారా ఒత్తిడి నుంచి దూరంగా ఉండవచ్చని సీఎస్ఆర్ కళాశాల వ్యవస్థాపకులు లోకేష్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శుక్రవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు యోగాపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యోగాసనాల సాధనతో మెరుగైన జీవనం పొందవచ్చన్నారు. యోగా శక్తివంతమైన జీవనమార్గమన్నారు. ఏకాగ్రతతో క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే మనిషి శారీరకంగా, మానసికంగా ఉన్నత స్థితికి చేరుకుంటారని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా అధిక రక్తపోటు, గుండెపోటు, మధుమేహం, ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. యమ, నియమ, అసన, ప్రాణాయామ, ధారణ, ప్రత్యాహార, ధ్యానం, సమాధి యోగసాధనాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ప్రిన్సిపాల్ రామచంద్ర, ఉపాధ్యాయులు సుధ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: నిత్యం యోగసాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని బొమ్మసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శరత్‌చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ హర్ష తెలిపారు. కళాశాలలో శుక్రవారం యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఏకాగ్రత పెరిగి విద్యలో రాణిస్తారని పేర్కొన్నారు. భారత దేశం తపోభూమి, ధర్మభూమి, యోగా భూమి అని, యోగా ద్వారా ప్రపంచానికి ఒక శక్తిని, వెలుగును ఇచ్చిందన్నారు. విద్యార్థులు తమ గ్రామాల్లోని వారికి యోగా నేర్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రెడ్డెప్ప, ఓబులేశు, జ్యోతిర్మయి, ప్రసన్న, తిరుమల సెల్వి, అమర్ తదితరులు పాల్గొన్నారు.

ఆచరిస్తేనే ఆరోగ్య యోగం

చిత్తూరు కలెక్టరేట్: ఆచరిస్తేనే ఆరోగ్య యోగం లభిస్తుందని యోగా గురువు నరేంద్ర కుమార్ తెలిపారు. చిత్తూరు నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సిద్ధ సమాధి యోగా శాఖ యోగా గురువు నరేంద్రకుమార్ మాట్లాడుతూ తమ శాఖ తరఫున నగరంలోని బృందావన్, సంతపేట మున్సిపల్ హైస్కూల్, 75 దొడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్ తదితర పాఠశాలల్లో యోగా డేను నిర్వహించినట్లు తెలిపారు. నగరంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ షమ్సు అక్తర్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే యోగా చేయడం అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ కళాశాల ప్రొఫెసర్లు ఉషారాణి, రాజ్యలక్ష్మీ, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు. నగరంలో ఉన్న విజయం పాఠశాలలో యోగా డేను ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ యోగాతో మనిషిలోని అంతర్గత శక్తి ప్రేరేపితమై శక్తివంతులను చేస్తుందన్నారు.









బంగారుపాళెం: తుంబకుప్పం ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న ఉపాధ్యాయులు, గుండ్లకట్టమంచి జెడ్పీహైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, **గుడిపాల:** ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, సావిత్రమ్మ డిగ్రీ కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థినులు









బంగారుపాళెంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు, **ఐరాల:** యోగా సాధన చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు, **పూతలపట్టు:** యోగా చేస్తున్న అధికారులు, యోగాసనాలు చేస్తున్న బృందావన్ పాఠశాల విద్యార్థులు

ప్రగతి పథంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు

చిత్తూరు అగ్రికల్చర్: సప్తగిరి గ్రామీణ బ్యాంకు లాభాలతో నడుస్తూ ప్రగతి పథంలో పయనిస్తోందని ఆ బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన పీఎఫ్ఆర్‌డీఏ కార్యక్రమంలో ఆయన డీఎఫ్ఎస్ సెక్రటరీ వివేక్ జోషి చేతుల మీదుగా అటల్ పెన్షన్ యోజన వార్షిక అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సప్తగిరి గ్రామీణ బ్యాంకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.26 వేలకోట్ల లావాదేవీలు చేసి రూ.350 కోట్ల నికర లాభం ఆర్జించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలులో ముందంజలో ఉందని తెలిపారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు సామాజిక భద్రతా పథకాల అమలులో కూడా ముందు వరుసలో ఉందని పేర్కొన్నారు. అటల్ పెన్షన్ యోజన పథకంలో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించినందుకు వరుసగా రెండో ఏడాది కూడా అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఘనత సాధించేందుకు కృషి చేసిన ఖాతాదారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



ఢిల్లీలో అవార్డును అందుకుంటున్న సప్తగిరి బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎస్ ప్రసాద్

ప్రజల చెంతకే వైద్యం

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో మారుమూల ప్రాంతాల్లో సైతం ప్రజల చెంతకే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని సవటపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వల్ల ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైదాధికారి ప్రవీణ్‌కుమార్

పాఠశాలల పరిరక్షణ అందరి బాధ్యత



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఐరాల: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ అందరి బాధ్యతని కాణిపాకం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు సూచించారు. ప్రభుత్వ బడిని రక్షించుకుందాం, పాఠశాలలో విద్యార్థులను చేర్పిద్దాం కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి కృషి చేయాలని కోరారు. విద్యార్థుల సామర్థ్యాలను మెరుగు పరిచి వారి అభ్యున్నతికి దోహదపడాలని సూచించారు.6–16 ఏళ్లలోపు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. చదువు, సంస్కారం, నైతిక విలువలు, దేశభక్తి, సమానత్వ భావన ఏర్పడేది సర్కారు బడిలోనే అని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, సురేంద్రబాబు, శాంతాదేవి పాల్గొన్నారు.

పంట కాలువ పరిశీలన

తవణంపల్లె: మండలంలోని దిగువమాఘంలో సప్లయి చానల్, పంట కాలువను శుక్రవారం చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, తవణంపల్లె తహసీల్దార్ అరుణకుమారి, ఇరిగేషన్ ఎస్ఈ విజయకుమార్ రెడ్డి, డీఈ ప్రసాద్‌నాయుడు, ఏఈ ఖాదర్‌బేగ్ పరిశీలించారు. చానల్, పంట కాలువ ఆక్రమణలపై లోకాయుక్త కోర్టులో కేసు జరుగుతోందని ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. కోర్టు ఆదేశాలు మేరకు సప్లయి చానల్ కాలువ, పంట కాలువను పరిశీలించి కోర్టుకు సమగ్రమైన రిపోర్టు అందజేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్వేయర్ బాబు, వీఆర్ఓ వెంకటముని పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జి ఈఈ మునిచంద్ర తెలిపారు. 33, 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిత్తూరు నగరం: కొంగారెడ్డిపల్లె, సంజయ్‌గాంధీనగర్, శంకరయ్యగుంట, తేనెబండ, శ్రీనివాసపురం, మార్కెట్ చౌక్, రామ్‌నగర్‌కాలనీ, జానకిరాంపల్లె, పలమనేరు రోడ్డు, టెలిఫోన్ కాలనీ.

చిత్తూరు రూరల్‌లో: కురుచివేడు, అనంతాపురం, తొప్పాటిపల్లె, మర్రిగుంట, పెద్దిశెట్టిపల్లె, మాపాక్షి, తుమ్మింద, చెన్నసముద్రం ప్రాంతాలు..

గుడిపాల మండలంలో: కొత్తపల్లె, పానాటూరు, ఏఎల్‌పురం

పూతలపట్టు మండలంలో: బండపల్లె, పోలవరం, లక్ష్మయ్యవూరు, ముత్తిరేవుల

పాలసముద్రం మండలంలో: సింహరాజపురం, నరసింహపురం

పెనుమూరు మండలంలో: కలవగుంట, శాతంబాకం, పంటపల్లె, కలికిరి, లంకిపల్లె, మఠంపల్లె ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



దోమల నివారణకు మందు పిచికారీ చేస్తున్నసిబ్బంది

బంగారుపాళెం: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల పర్యవేక్షకుడు హరికృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని ఎర్రాండ్లపల్లెలో ఆయన పర్యటించారు. దోమల నివారణకు మందులు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో దోమలు ఎక్కువగా వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. దోమ కాటుతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు వస్తాయని హెచ్చరించారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని తెలిపారు. పేడ దిబ్బలను ఊరికి దూరంగా వేసుకోవాలని స్పష్టం చేశారు. దోమల నివారణకు సాయంత్రం పూట వేపాకు పొగ వేయాలని, దోమతెరలను వినియోగించాలని వివరించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు.

విస్తారంగా వర్షం

కాణిపాకం: చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాలవ్యాప్తంగా శుక్రవారం కూడా విస్తారంగా వర్షం కురిసింది. పంట కాలువలకు నీరు చేరుతోంది. నిత్యం కురుస్తున్న వర్షంతో వేరుశనగ సాగుకు అనుకూలంగా ఉందని వ్యవసాయశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం





టి.పుత్తూరులో అంగరంగవైభవంగా సీతారాముల కల్యాణం, గరుడునిపై ఊరేగుతున్న స్వామివారు

తవణంపల్లె: టి.పుత్తూరులోని కోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయ స్వామికి అభిషేకం ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీపనైవేద్యం సమర్పించారు. అనంతరం ఉభయకర్తలు సుధాకర్ పిళ్లై కుటుంబసభ్యుల చేతులమీదుగా తిరుమంజనం, ఉభయకర్త మురళిరెడ్డితో పాలాభిషేకం చేయించారు. సాయంత్రం ఉభయకర్త రామచంద్రనాయుడు కుటుంబసభ్యులతో వైభవంగా కల్యాణోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా ఉభయకర్త సీతారాములకు పట్టు వస్త్రాలు, మంగళసూత్రాన్ని, పూలదండలు, ప్రసాదాలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గరుడునిపై కోదండరాముడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి గరుడ వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయకర్త పాలాక్షిరెడ్డి కుటుంబసభ్యులు ఊరేగింపుగా ఉభయం తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం సుగంధ పుష్పాలతో అలంకరించిన గరుడ వాహనంపై స్వామివారిని కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకం, సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రి గజ వాహనం సేవ నిర్వహించనున్నట్లు ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

ఐరాల: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లేబర్ అధికారి ఆనంద్‌బాబు, ఎంఈఓ రుషేంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పాలకల సంతగేటులో అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. దుకాణాలు, మెకానిక్ షెడ్లు, వివిధ దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బాల కార్మికులుగా మారకూడదన్నారు. వారంతా తప్పనిసరిగా బడిలోనే ఉండాలని కోరారు. బాలలందరిని బడికి పంపిద్దామని, వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుదామని సూచించారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, పంచాయతీ కార్యదర్శి శరణ్‌తేజ, జూనియర్ అసిస్టెంట్ దినేష్, సచివాలయ మహిళా పోలీసు శ్వేత పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న లేబర్ అధికారి ఆనంద్‌బాబు

గర్భిణుల నమోదు తప్పనిసరి

తవణంపల్లె: గర్భిణులను మూడో మాసంలో తప్పనిసరిగా పేర్లు నమోదు చేయాలని డీపీఎంఓ హర్షవర్ధన్ ఆదేశించారు. ఆయన శుక్రవారం మండలంలోని పైమాఘం సచివాలయం, తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పైమాఘంలో గర్భిణులకు రక్తపరీక్షలు చేయించారు. రక్తహీనత ఉన్న వారికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. పిల్లలకు టీకాలు వేయించడంపై అవగాహన కల్పించారు. అదే విధంగా బీసీజీ వ్యాక్సిన్‌ను ప్రతి సోమ, గురువారాల్లో 60 ఏళ్లు పైబడిన వారు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు వేయించాలన్నారు. తవణంపల్లె పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు రక్తహీనత నివారణకు కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలిపారు. విధిగా ఫ్రైడే డ్రైడే చేయించాలని ఆదేశించారు. రిజిస్టర్ల నమోదుపై అవగాహన కల్పించారు. గర్భిణులకు ఏఏ సమయంలో ఎలాంటి పరీక్షలు చేయించాలో, స్కానింగ్, ప్రసూతి సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రామమోహన్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, లలిత్, సీహెచ్‌ఓ రాజామణి, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, శ్రీహరి, నిర్మలమ్మ, రెడ్డెమ్మ, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డీపీఎంఓ హర్షవర్ధన్